స్వాతి వారపత్రిక, మే 25, 2001

"ప్రహ్లాదుడి హరిభక్తి, లక్ష్మణుడి సోదరభక్తి, ఆంజనేయుడి స్వామిభక్తి కలిపి త్రాసులో ఒక పళ్ళెంలో వేస్తే లక్ష్మణరావు బాసు భక్తి రుక్మిణీదేవి తులసి దళంలా ఆ పళ్ళాన్నే నేలకతుక్కుపోయేలా చేస్తుంది-"

# మోక్షగామి

"ఏ పేరుతోనైనా పిలవచ్చు. ఏ రూపాన్నైనా ధ్యానించవచ్చు. అహాన్ని మరచి ఏకాగ్రతతో పూజిస్తే చాలు. మోక్షాన్నిస్తాను..." అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ. ఆ మాటలు వంట బట్టించుకున్నవాడు లక్ష్మణరావు.

లక్ష్మణరావు దేవుణ్ణి రామచంద్రా, విశ్వేశ్వరా, పరమానందా అని పిలుస్తాడు. ఆ మూడూ అయిదారేళ్ళకోసారి మారుతూండే అతడి పై ఆఫీసర్ల పేర్లే. వాళ్ళ రూపాలు తల్చుకుంటేనే అతడికి తనువు పులకరిస్తుంది. వాళ్ళేమి చేసినా అతడికి లీలలుగా అనిపించి పరవశిస్తాడు. వాళ్ళ ముందు అతడికి అహం తెలియదు.

మరపులో లక్ష్మణరావు రాజకీయనేతలను ఎప్పుడో మించిపోయాడు. రామచంద్రానికి ట్రాన్స్‌ఫరై విశ్వేశ్వరుడు వచ్చినప్పుడు ఆయన దగ్గరివాడు కదా అని లక్ష్మణరావుని రామచంద్రం గురించి అడిగాడు... వివరాలు తనకు ఉపయోగపడ వచ్చునని.

"రామచంద్రం ఎవరుసార్?" అన్నాడు లక్ష్మణరావు.

సాధారణంగా కొత్తగా వచ్చిన ఆఫీసరు వెళ్ళిపోయిన పాత ఆఫీసరు గురించి మంచి వినాలనుకోడు, చెడ్డను వినాలనుకుంటాడు. ప్రస్తుతానికి ఆ చెడు అంతటికీ ప్రధానమైన కారణభూతుడు వెళ్ళిన రామచంద్రం.

ఆ లోపాలన్నీ సవరించి ఆఫీసును అధోగతినుంచి కాపాడ్డానికి వచ్చిన అవతార పురుషుడు విశ్వేశ్వరుడు. ప్రతి అవతారానికీ కాలపరిమితి ఉన్నట్లే విశ్వేశ్వరుడికీ అంత్యకాలం వచ్చినప్పుడు శివధనుస్సు విరిగింది, పరశురాముడి విష్ణుచాపం శ్రీరాముణ్ణి చేరింది.

అప్పుడు శ్రీరాముడి పేరు పరమానందం. పరమానందం వస్తూనే లక్ష్మణరావుని పిలిచి విశ్వేశ్వరుడి గురించి అడిగాడు. "ఆయనెవరు సార్?" అన్నాడు లక్ష్మణరావు.

ప్రహ్లాదుడు హరిధ్యానం కోసమే పుట్టాడు. లక్ష్మణుడు అన్నను అనుసరించడానికే పుట్టాడు. ఆంజనేయుడు రాముడి సేవలకోసమే పుట్టాడు. ఈ ముగ్గురి భక్తినీ కలిపి త్రాసులో ఒక పళ్ళెంలో వేస్తే లక్ష్మణరావు భక్తి రుక్మిణీ దేవి తులసిదళంలా త్రాసులోని మరో పళ్ళాన్ని నేలకు అతుక్కుపోయేలా చేస్తుంది.

అతడు కొలీగ్సుతో పరమానందం గురించే మాట్లాడతాడు. ఇంట్లో పరమానందం లీలలు చెప్పి పరవశిస్తాడు. భార్యతో శృంగారం కంటే కూడా పరమానందం సమక్షానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడతడు.

లక్ష్మణరావు భార్య పేరేదైనా అందరూ ఊర్మిళ అంటారు. వయసులో ఉన్నప్పుడు ఊర్మిళలా ఊరించే అందాలతో ఉన్నా... ఆమెకాపేరు లక్ష్మణరావు భార్య అన్న జాలితోనే వచ్చింది. అయినా ఆమెకు ఊర్మిళ అన్న పేరు వచ్చేటప్పటికి ఊర్మిళ మాసూమ్ బాలనటిగా మాత్రమే అందరికీ తెలుసు.

రామాయణంలో ఊర్మిళ కొంతవరకూ అదృష్టవంతురాలు. భర్త చెంతలేనప్పుడామె గాఢ నిద్రలో ఉండేది. ఈ ఊర్మిళకు ఇల్లు అంతఃపురమైతే ఆఫీసు అడవి. లక్ష్మణరావు వనవాసంలో ఉన్నట్లే భావిస్తుందామె.

ఆమెకు శృంగార జీవితమున్నదనడానికి సాక్ష్యంగా ఇద్దరు పిల్లలున్నారు. వాళ్ళు లక్ష్మణరావు పోలికలతోనే ఉంటారు. అదెలా సాధ్యపడిందని చాలామంది ఆశ్చర్యపడితే కొందరు ఆత్మీయులకామె అసలు రహస్యాన్ని చెప్పుకుంది.

కాలేజీ రోజుల్లో ఊర్మిళ మిమిక్రీ చేసి ఎందరి అభినందనలనో పొందింది. పెళ్ళయ్యాక ఆ విద్యకు మెరుగులు దిద్ది ప్రదర్శనలిచ్చే స్థాయికి ఎదిగింది. అలనాటి ఊర్మిళ నిద్రపోగలిగింది కానీ నేడది సాధ్యపడదు కదా... ఇల్లు పట్టని భర్త ఉన్నందుకామె ఇలాంటి వ్యాపకాలు పెట్టుకోక తప్పదని కొందరు జాలిపడ్డారు.

కానీ లక్ష్మణరావుకు ఇల్లుపట్టదనడానికి లేదు. అతడింట్లో సాధారణ గృహిణులకు కలలనిపించే సదుపాయాలున్నాయి. పిల్లలు మంచి స్కూళ్ళలో చదువుతున్నారు. భార్యభర్తలు కలిసి తిరుగుతూంటారు. చూడ్డానికి వారిది మంచి కుటుంబం అనిపిస్తుంది.

అలాంటప్పుడు ఊర్మిళకు మిమిక్రీ ప్రదర్శనలెందుకూ అనిపించవచ్చు. ఏ విద్య అయినా ప్రదర్శనతోనే రాణిస్తుంది. ప్రదర్శనలు వున్నంతకాలం సాధన ఉంటుంది. సాధన సమర్థతకు మెరుగులు దిద్దుతుంది.

ఇంట్లో ఊర్మిళ రామచంద్రాన్ని అనుకరిస్తే లక్ష్మణరావు రామచంద్రమే మాట్లాడుతున్నాడని భక్తి భావంతో వినేవాడు. ఆ గొంతుతో ఆమె ఏం చెప్పినా చేసేవాడు. ఇష్టంలేని కూర తినేవాడు. తనకు నచ్చని పని కూడా చేసేవాడు.

ఎల్లకాలమూ గొంతుననుకరించడం సాధ్యం కాదు కదా! జలుబు చేసి గొంతు పూడుకుపోవచ్చు. జ్వరం వచ్చి గొంతు తిరక్కపోవచ్చు. మూడ్ కుదరక గొంతును యధాతథంగా అనుకరించలేకపోవచ్చు.

అలాంటి పరిస్థితిలో లక్ష్మణరావు - పిండాలను కుక్కలకు వేసిన చండికలా

ప్రవర్తించే ప్రమాదముంది. అలాంటప్పుడు భర్తను అదుపుచేయడానికి ఊర్మిళ రకరకాలైన మాస్కులను సృష్టించుకుంది.

ముఖానికి రామచంద్రం మాస్కు తగిలించుకుంటే లక్ష్మణరావు అప్రతిభుడై ఆమెననుసరించేవాడు.

తమ సంసారం మూడు పువ్వులూ ఆరుకాయలుగా కొనసాగడానికి ఈ మాస్కు మిమిక్రీలే కారణమని ఊర్మిళ తన ఆత్మీయులతో చెప్పుకుంది.

అయితే ఆఫీసర్లు ట్రాన్స్‌ఫరై కొత్తవారు వచ్చినపుడామెకు అడ్జస్టుకావడం కష్టంగా ఉండేది.

ఒకసారి ఆమెభర్తతో, "ఆఫీసర్ని దేవుడిగా కొలవడం వరకూ బాగానే ఉంది. ట్రాన్స్‌ఫరవగానే దేవుడు మారిపోతే ఎలా?" అని దిగులు పడింది.

"ఆఫీసు నాకు ఆలయం. ఆఫీసరు నా దేవుడు. ఆ స్థానమే నాకు ముఖ్యం. విగ్రహాలు మారినా... ఆ స్థానంలో ఏ విగ్రహముంటే అదే నాకు దైవం" అన్నాడతను.

ఇలాంటి పరిస్థితుల్లో పరమానందానికి ట్రాన్స్‌ఫరైంది. కొత్త ఆఫీసరు వచ్చేదాకా అందాకా ఆఫీసు వ్యవహారాలు సక్రమంగా చూడమని ఆ ఆఫీసులో అందరికంటే సీనియర్ అయిన గంగాధరాన్ని నియోగించారు. పరమానందం ఉండగా సీనియర్ అయిన గంగాధరానికి బదులు లక్ష్మణరావే దివ్యప్రభలతో వెలిగిపోతూండేవాడు.

గంగాధరానికి అప్పుడు అతడంటే అసూయగా ఉండేది. కానీ ఇప్పుడు అసూయకు బదులు... లక్ష్మణరావు పూజలందుకోవాలని అతడికి ఆశగా ఉంది.

అయితే లక్ష్మణరావుకి తొందరలోనే రాబోయే రమాకాంతుడి గురించి తెలిసిపోయింది. అసలు దేవుణ్ణే తప్ప ఉత్సవ విగ్రహాలను స్మరించే అలవాటు లేదతడికి.

లక్ష్మణరావును ఆకర్షించడానికి గంగాధరం సామదాన భేదదండోపాయాలను ప్రయోగించి విఫలుడయ్యాడు. అన్నింటినీ అతడు ప్రహ్లాదుడిలా ఎదుర్కొని రమాకాంతుని రాకకోసం ఎదురుచూడసాగాడు.

రమాకాంతుడు రావడానికి మూడు నెలలు పట్టింది. ఆ మూడునెలలూ లక్ష్మణరావు తిప్పలు ఇన్నీ అన్నీ కావు. అయినా అతడు చలించలేదు.

ఆఫీసులో అందరూ ఆయన్ను రమాకాంతుడనడానికి ప్రధానమైన కారణం ఆయన భార్యపేరు రమ కావడం కూడా కావచ్చు. ఆఫీసర్ల అసలు పేరు సర్‌కు మాత్రమే పరిమితం కావడం వల్ల కూడా రమాకాంతుడనడంలో ఇబ్బందిలేకపోవచ్చు. ఇబ్బంది అల్లా ఆయన భార్య రమ ఆయనకంటే చాలా చిన్నది.

అందగత్తె కావడం వల్ల మరింత చిన్నదిగా కనిపిస్తుంది. అట్టే చదువుకోని పల్లెటూరి పేదరాలు కావడం వల్లనే ఆమె ఈ పెళ్ళికి ఒప్పుకుందనీ లేకుంటే అచ్చం నరసింహుడి రూపంలో ఉండే రమాకాంతుణ్ణి ఏ ఆడదీ పెళ్ళిచేసుకోదనీ లక్ష్మణరావు వినకుండా చాటుమాటుగా చెప్పుకునేవారు ఆఫీసు స్టాఫంతా.

తన హోదా ప్రదర్శించుకోవాలని రమకు తాపత్రయం. తన అదృష్టాన్ని

ప్రదర్శించుకోవాలని రమాకాంతుడి తాపత్రయం. ఫలితంగా ఆ దంపతులు తరచుగా కలిసి కనబడేవారు. అజ్ఞానమో, అమాయకత్వమో, కుసంస్కారమో... రమ దర్పాన్ని ప్రదర్శించేది.

ఎదుటివారిని చిన్నబుచ్చేది. రమాకాంతుడామె చేష్టలకు ముచ్చటపడుతుండేవాడు.

ఇది మొత్తం స్టాఫుకంతా ఇబ్బంది కావచ్చును కానీ లక్ష్మణరావుకు కాదు. అతడు మూడు నెలలనుంచి శ్రీపాద దర్శనం కోసం ఎదురుచూస్తున్నాడు. పూజచేయాలని తహతహలాడిపోతున్నాడు. పరమానందం ఎవరూ అని ఆశ్చర్యపడాలని ఆత్రపడు తున్నాడు. అయితే రమాకాంతుడు వచ్చి చేరినా అతడి ఈప్సితాలు అలాగే ఉండిపోయాయి. కారణం రమాకాంతుడికి వ్యక్తి పూజనచ్చదు. పని... పని... పని... వర్క్ఇజ్ వర్షిప్ అంటాడతడు.

లక్ష్మణరావు పని చేయగలడు. చేస్తాడు. కానీ గంగాధరం తన మూడు నెలల కాలాన్నీ ఉపయోగించుకుని లక్ష్మణరావును ఎందుకూ పనికిరానివాడుగా చిత్రీకరిస్తూ ఓ రిపోర్టు తయారు చేశాడు.

అందుకో కారణముంది. తొందరలో మరో ప్రమోషనుకు పోటీపడుతున్న ముగ్గురిలో ఒకడు లక్ష్మణరావు. రెండోవాడు గంగాధరం. మూడోవాడు గణపతి.

గత పదిహేను సంవత్సరాల్లో లక్ష్మణరావు ఇరవయ్యో స్థానం నుంచి నాలుగోస్థానానికి ఎదిగాడు. ఇప్పటి ప్రమోషన్ ఎవరికి వస్తే వారు రమాకాంతుడి తర్వాత రెండో స్థానాన్ని చేరుకుంటారు.

అటు లక్ష్మణరావు భక్తీ, ఇటు గంగాధరం యుక్తీ చేత కాని గణపతికి వేరే ఆశలు పెట్టి తనవైపుకు తిప్పుకున్నాడు గంగాధరం. గంగాధరం రిపోర్టుకు గణపతి వత్తాసు లభించడంతో రమాకాంతుడికి లక్ష్మణరావంటే చాలా పెద్ద దురభిప్రాయమే ఏర్పడిపోయింది.

అందువల్ల లక్ష్మణరావు రమాకాంతుణ్ణి – "అదిగో అల్లదిగో" అని దూరాన్నుంచి చూసి అన్నమయ్యలా పరవశిస్తూనే... "తెర తీయగ రాదా" అని త్యాగయ్యలా ఆక్రోశించసాగాడు.

రమాకాంత సందర్శన భాగ్యం లభించక అతడు ఆఫీసుపని కూడా సరిగ్గా చేయలేక.... రమాకాంతుడి ఆగ్రహాన్ని మరింతగా పెంచుకున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో కారణజన్ముడైన లక్ష్మణరావుకు అప్రయత్నంగానే భద్రాచల రామదాసు మార్గం స్ఫురించింది. వెంటనే అతడు "మముబ్రోవమని చెప్పవే" అంటూ ఆఫీసరు ఇంటికి వెళ్ళి రమను వేడుకున్నాడు.

రమ అతణ్ణి వేళాకోళం చేసింది. అతడామె హాస్య చతురతను మెచ్చుకున్నాడు. అతణ్ణి శూలాల్లాంటి మాటలతో గుచ్చింది. చిరునవ్వుతో భరించాడు. ఆమె కూరలు తెమ్మంటే తెచ్చాడు. బట్టలు లాండ్రీకివ్వమంటే ఇచ్చాడు.

పల్లెటూళ్ళో బాండెడ్‌లేబర్ కూడా అంతలా అణిగిమణిగి ఉండరని ఎరిగున్న

రమకు లక్ష్మణరావు క్రమంగా నచ్చి అతడి గొప్పతనాన్ని పదే పదే భర్తకు వినిపించ సాగింది. పడుచుభార్య మాట తీసివేయలేక రమాకాంతుడు ఆఫీసులో లక్ష్మణరావును చేరదీయసాగాడు.

అతడే సంజాయిషీ ఇచ్చుకుంటాడో చూద్దామని, "ఇంతవరకూ నువ్వు చేసిన పనిని బట్టి ఒట్టి పనికి రాని దద్దమ్మవని అర్థమైంది. ఆఫీసులో నిన్నేం చేసుకోవాలో నాకు తెలియడం లేదు..." అన్నాడాయన ఓసారి.

"అయ్యా! నేను పనికి రాని దద్దమ్మనే. శ్రీరాముడు కోతిమూక సాయంతో మహాసముద్రానికి వారధి కట్టి రావణుడంతటి మహా బలవంతుణ్ణి నిర్జించాడు. మహాత్ములకు సాధనాలతో నిమిత్తం లేదు. మీరు మహాత్ములు. నన్ను నేనైనా ఉపయోగించుకోలేనేమో కానీ మీరుపయోగించుకోగలరు" అంటూ దాశరథీ శతక పద్యం స్థాయిలో బదులిచ్చాడు లక్ష్మణరావు.

ఇలాంటి సమాధానం ఊహించని రమాకాంతుడు దిమ్మెరపోయాడు. ఈ వార్త క్షణాలమీద ఆఫీసంతా పాకిపోగా గంగాధరం కలవరపడ్డాడు.

లక్ష్మణరావు ఉధృతాన్ని ఆపాలంటే గంగాధరానికి ఒక్కటే ఉపాయం తోచింది. అందులో భాగంగా - ముందుగా అతడు లక్ష్మణరావు శీలంమీద బురద చల్లాలనుకున్నాడు. ఆఫీసులో రెండు సంవత్సరాలనుంచి పనిచేస్తున్న అందాల సీమతో అతడు అసభ్యంగా ప్రవర్తించాడని ఎవరో అనగా విన్నానని ఒకరిద్దరి వద్ద అన్నాడు. అది పుకారై ఆఫీసంతా పాకింది.

అయితే ప్రతి ఒక్కరూ, "సీమకు రమాకాంతుడంటే కిట్టదు. ఎవరు కలిసినా ఆయన్ను దుమ్మెత్తిపోస్తుంది. అయినా ఆయనకా పిల్లమీద కోపం రావడం లేదంటే ఆమెకోసం ట్రై చేస్తున్నది లక్ష్మణరావు కాదనీ ఆయనేననీ అనిపిస్తుంది..." అన్నారు.

"ఏం.... ఆయన ట్రై చేస్తే అతడు ట్రై చేయకూడదని ఉందా?" అన్నాడు గంగాధరం.

"గురూ... నువ్వు అసలు పాయింటు మిస్సయ్యావు. రమాకాంతుణ్ణి పల్లెత్తుమాట అంటే చాలు... ఆ మనిషికి ఆమడ దూరం మెయిన్‌టైన్ చేస్తాడు లక్ష్మణ్మరావు. అలాంటిది సీమ తనే చేరతానన్నా దరికి చేరనిస్తాడా?" అన్నారు స్టాపు స్టాఫంతా ఏకగ్రీవంగా.

ప్రమోషన్ ధోరణిలోపడి ఇంత చిన్నపాయింటు మిస్సయినందుకు గంగాధరం నాలిక్కరుచుకున్నా... ఈ పుకారు ఎలాగో రమాకాంతుడిదాకా వెళ్ళి ఆయన గంగాధరాన్ని లక్ష్మణరావుపై అభిప్రాయం చెప్పమన్నాడు.

వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా, "ప్రమోషన్ అంటే మోక్షమంటాడు లక్ష్మణరావు. కామిగాక మోక్షగామి కాదని అతడెంత నొక్కిస్తాడంటే ఆఫీసులో మేమెవరం అతడిని మా ఆడవాళ్ళకు పరిచయం కానివ్వలేదు. వాళ్ళమీద నమ్మకం లేక కాదు. ఆడతనంలోని అమాయకత్వాన్ని చాపకింద నీరులా కమ్ముకునే తెలివి అతడికుంది...." అన్నాడు గంగాధరం లక్ష్మణరావు అట్నించి నరుక్కు రాకుండా ఆపడానికి.

ఆ మాటల్లో తన భార్య గురించి హెచ్చరిక వుందని గ్రహించిన రమాకాంతుడు సందిగ్ధంలో పడ్డాడు.

ఆ తర్వాత రెండు రోజులకే ఓ కంట్రాక్టరు ఇంట్లో పెళ్ళికి మొత్తం ఆఫీసు స్టాఫంతా వెళ్ళారు. ఆ పెళ్ళికి రమ పాపిడి పిందెలు, జడగంట్లు, పలకసర్లు, కాసుల పేరు, భుజకీర్తులు, వడ్డాణం, పట్టీలు వగైరా పెట్టుకుని వచ్చింది. చాలామంది రకరకాల ఆభరణాలు ధరించినా అన్ని రకాలూ ధరించినది రమే కావడంతో ఆమె అక్కడ పెద్ద ఆకర్షణ అయింది. అంతలో అక్కడికో బందిపోటు ముఠా వచ్చింది. ఆడా, మగా అందరూ తమ తమ ఆభరణాలు తీసి బందిపోట్లు పరిచిన దుప్పట్లో వేశారు. దుప్పటి మూటగా మారిందో లేదో, ఎలా వచ్చారో పోలీసులు వచ్చారు. పోరాటం లేకుండానే బందిపోట్లు లొంగిపోయారు.

అంతా కలలా జరిగిపోయింది. కానీ జరిగిందానికి భయపడి రమకు స్పృహ తప్పింది. అంతా వచ్చి మూటలోని నగలను గుర్తుపట్టి ఏరుకుంటున్నారు. రమాకాంతుడి మనసు గజిబిజిగా ఉండి స్టాఫు సాయం కోరితే వాళ్ళా బాధ్యతను లక్ష్మణరావుకు అప్పగించారు.

అతడు మూటంతా వెదికి రమ కాలీపట్టీలు మాత్రం తీసి,"ఇంకేమీ లేవు..." అన్నాడు. "నిన్ను నమ్ముకుంటే ఇంతే!" అంటూ గంగాధరం రమ ధరించిన ఆభరణాలన్నీ తీసి పట్టుకొచ్చి జరిగింది గొప్పగా చెప్పాడు.

"రామాయణంలో లక్ష్మణుడి గురించి చదివాను. పరస్త్రీ పాదాలు తప్ప చూడని నీ శీలం అమోఘం..." అంటూ రమాకాంతుడు లక్ష్మణరావును కౌగిలించుకునే దాకా... స్వామిభక్తిలో తన ప్రత్యర్థి చేరుకున్న స్థాయి గంగాధరానికి అర్థం కాలేదు.

ఆ ఏడాదే లక్ష్మణరావు ఆఫీసులో రెండోస్థానాన్ని చేరుకున్నాడు.

✦ ✦ ✦